# అమ్మ నన్ను కొట్టింది



అమ్మిన శ్రీనివాసరాజు



"బుజ్జీ... కన్నా... నా కొండ కదా... నా తల్లి కదా... నా పెన్‌తో ఆ కాగితాల మీద అలా గీసేస్తావా? తప్పుకదా. ఇంకెపుడూ అలా చెయ్యకే!" అంటూ తన గారాల పట్టి శ్రీజను ఆ కాగితాలకు దూరంగా బెడ్‌రూమ్‌లోకి తీసు కెళ్లింది పూర్ణ. ఐదురోజులు కష్టపడి తయారు చేసిన కాలేజీ ఎగ్జామ్ బ్రాంచ్‌కి సంబంధించిన రిపోర్ట్స్ అన్నీ శ్రీజ చేతి అల్లరితో చెల్లాచెదురై, పనికిరాకుండా పోయాయి. అవి తయారుచేయాలంటే ఖచ్చితంగా ఇప్పుడు మరో నాలుగు రోజులు పడు తుంది. తలుచుకుంటేనే కళ్లు బైర్లు కమ్మాయి పూర్ణామేడమ్‌కి.

వయసు పెరిగితే అల్లరి దానికదే తగ్గిపోతుందని పూర్ణ ధీమా... అల్లరి విషయం అటుంచి శ్రీజ అంటే తనకు పంచప్రాణం. అందుకే ఎంత అల్లరి నైనా భరిస్తుంది. పెంకితనపు అల్లరి మాన్పించలేక విసుగుతో ఒక్కోసారి తానే ఏడ్చేస్తుంది తప్ప అలా పెంకిగా ఉండడం తప్పు అని ఒక్క దెబ్బ ఏనాడూ శ్రీజ ఒంటిమీద వేయలేదు పూర్ణ. "అంత గారమైతే ఇక అంతే సంగతులు, దేనికైనా హద్దుండాలి" అనే శ్రీవారి హెచ్చరి కలు, తిట్లూ ఓపికగా భరించేది.

"నా స్వీటీ... లాఫీ... హాసీ.., అంటూ తానే చిన్నపిల్లైపోయి ముద్దుముద్దుగా బోలెడు ముద్దు పేర్లతో ముద్దులు కురిపిస్తూ అల్లుకుపోయేది పూర్ణ. ఇంతటి ప్రేమను కురిపించే అమ్మను చూస్తే ఎవరికైనా ఎన్నాళ్లైనా ఎన్ని జన్మలు ఎదురుచూసైనా ఇలాంటి అమ్మకే బిడ్డగా పుట్టాలనిపిస్తుంది.

శ్రీజ వయసుతో పాటు అల్లరి రోజురోజుకీ ఎంచక్కా పెరిగిపోతోంది. వయస్సుతోపాటు పెరిగే తెలివితేటలు, ముద్దుముద్దు మాటలు అడిగే ప్రశ్నలకు హద్దే లేకుండా వుంది. కొత్త వాళ్లు లేదు, పాతవాళ్లూ లేదు... ఒక్కసారి చూస్తే చాలు వందేళ్ల పరిచయస్తురాలిలా అల్లుకుపోతుంది. చిన్నప్పటి నుంచి పిల్లలకు ప్రశ్నించే గుణం అలవడాలనే అభిప్రాయం పూర్ణలో పాతుకుపోయి వుండడం వల్లే ఒళ్లో కూర్చోబెట్టుకుని బుల్లిబుల్లి మాటలతో అడిగే వాటికన్నిటికీ ఓపిగ్గా జవాబులు చెబుతూ లాలించేది.

రోజువారీ అల్లరిలో భాగంగా ఒకరోజు శ్రీజ చేతిలో పేపర్‌వెయిట్ టీవీ స్క్రీన్‌వైపు గురి చూసింది. గురి తప్పలేదు! "ధాం" అని చిన్న పిడుగులాంటి శబ్దం... అంతే... బాత్‌రూమ్‌లో ఉన్న పూర్ణ అల్లాడిపోతూ గజేంద్రమోక్ష ఘట్టంలోని శ్రీకృష్ణుడిలా... గిరిగిర... వచ్చేసింది ఏం జరిగిందో తెలియక. ఏమీ తెలియనట్టు చూస్తున్న శ్రీజను ఆబగా హత్తుకుని ఒళ్లంతా తడిచేతులతో తడిమేసింది. కూతురుకు ప్రమాదం జరగలేదని తెలిసి ఒక్క నిట్టూర్పు విడిచి తనను తాను చూసుకుని అవాక్కైంది... 'అయ్యో! అనుకుంటూండగానే "షేమ్... షేమ్" అంటూ ముద్దుపలుకులతో బుల్లిబుల్లి అడుగులేస్తూ వసారాలోకి జారుకుంది అల్లరి మంచుపిడుగు.

ఇంతకీ అంతపెద్ద శబ్దానికి కారణమేమిటో అనుకుంటుండగానే వెతకబోయే తీగ కాలికి తగిలినట్లు పగిలిన టీవీ స్క్రీన్ బాపతు గాజు ముక్క పూర్ణ కాలికి గుచ్చుకుంది. "అమ్మా...!" అంటూ బాధతో అరవాలనిపించినా వాళ్లమ్మ గారు ఉన్న ఊరికి ఎలాగూ వినిపించదని తెలిసిన విజ్ఞురాలు పూర్ణ. అంత బాధనూ తనలో తురిమేసుకుని కాలికి గుచ్చుకున్న గాజుముక్కను ఒడుపుగా బైటకులాగి బొటాబొటా కారుతున్న రక్తాన్ని తడిగుడ్డతో ఆపడానికి ప్రయత్నం చేసింది. ఎరుపురంగు చూస్తేనే కళ్లు మూసేసుకునే భీతివతి పూర్ణ అంత రక్తం కళ్లబడడంతో ఏమైపోవాలి?! కాని బిడ్డమీద గల మమకారం ఆ భయాన్నంతటినీ తరిమేసింది. ఇంత పెద్ద దెబ్బ ఎందుకు తగిలింది! ఏదో తన గారాలపట్టి చేసిన బుల్లి అల్లరికే కదా! అయినా తను అలా పగిలి పోతుందని కొట్టిందా? ఏదో ఆడుకుంటూ విసిరింది... ఏదిఏమైనా తన ముద్దుల లాఫీకి ఏమీకాలేదు. తన కాలికి గుచ్చుకున్నట్టు స్వీటీకి గుచ్చుకుంటే?! అమ్మో ఇంకేమైనా ఉందా?! వెధవ టీవీ పోతేపోయింది. నా లాఫీ క్షేమంగా ఉంది... అంతే చాలు... అనుకుంటూ ఆ ఆనందంతో తన కాలికి తగిలిన దెబ్బ విషయమే మర్చిపోయి నడకలో మార్పుతో ఇంటిపనుల్లో ఇరుక్కుపోయింది పూర్ణ.

* * *

ఆధునిక ఆవేశాల నిధి అయిన పూర్ణకు ప్రాచీన సాంప్రదాయాల సరిహద్దులూ కావాలి. శ్రీజకు అన్నిటితోపాటు "చదువుకొనే" వయసు వచ్చింది. తమ హోదాకు తగ్గట్టుగానే పేరున్న పెద్ద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అయినవారి అందరి రికమెండేషన్ల సహకారంతో గట్టి ప్రయత్నం చేసి మొత్తానికి యు.కె.జి.లో అడ్మిషన్ అడిగినంత డొనేషన్ అందించి మరీ పొందారు. శ్రీజకు ఆ స్కూల్లో అడ్మిషన్ రావడం చాలా చాలా అదృష్టంగా భావించింది పూర్ణ.

అలా రావడానికి అజ్ఞాతంగా సహకరించిన ఆపదమొక్కులవాడికి మొక్కు చెల్లించుకోవడానికి తిరుపతి ట్రిప్‌కి కూడా సిద్ధమయింది పూర్ణ.

అనుకున్న ప్రకారం తన చిరకాల వాంఛతో అందరికన్నా విభిన్నంగా ప్రతిష్ఠాత్మకంగా శ్రీజ అక్షరాభ్యాస కార్యక్రమానికి భారీఎత్తున ఏర్పాట్లు కూడా చేసారు. విభిన్నత్వానికి ప్రతిరూపం అయిన పూర్ణ అక్షరాభ్యాస ఆహ్వానాలను "చదువుల సన్నాయి పిలుపులు" అనే టైటిల్‌తో కార్డులు వేయించి తెలిసినవారందరికీ పంపించింది. తన పెళ్లికన్నా ఘనంగా శ్రీజ అక్షరాభ్యాస కార్యక్రమం జరిపించాలన్నదే ఆమె లక్ష్యం. అనుకున్న ప్రకారం అన్నిపనులు అనుకున్న విధంగా అయినవాళ్ల సమక్షంలో సలక్షణంగా జరిపించి, పరమానందంతో పరవసించింది పూర్ణామేడం!


శ్రీజకు జరుగుతున్న వైభవానికి ఎవరి పరిధిలో వారికి ఈర్ష్యాభూతం ఆవరించింది. ఎవరేమనుకున్నా ఆ పిల్ల అదృష్టం ఆ పిల్లది. ఎన్నెన్ని జన్మలనుండో ఆ దేవుడ్ని ప్లాటినం పూలతో పూజలు చేసుంటుంది. అందుకే అంతటి అనురాగదేవతకు బిడ్డగా కడుపు చించుకు మరీ పుట్టింది.

శ్రీజను చేర్పించిన కాన్వెంట్ చరిత్ర, అందులో చదువుకున్నవారి ఉన్నత చరిత్రా... అంతా పరిశోధనాత్మకంగా సేకరించిన పూర్ణామేడం తన హోదా కూడా అంతటి స్థాయికి ఎదగాలని ఎంతో ఆత్మస్థైర్యంతో కష్టంలేకుండా ఇష్టపడి మరీ 'కలలు' చూసేది.

శ్రీజ కాన్వెంట్ ప్రయాణానికి పూర్ణామేడం చేసే ప్రభాతసేవ 'అంతింతగాదయా... అఖిలాంధ్రనాధా' అన్నట్లు తయారయ్యింది. మంచు పిడుగుని కాన్వెంట్ బస్ ఎక్కించేవరకూ పూర్ణామేడంకు ఓ చిన్నపాటి పెళ్లితంతు చక్కబెట్టుకున్నట్టే! అయినా ఏనాడూ తన సహనాన్ని లాఫీ పట్ల కోల్పోలేదు. వినయశీలి, సహనవతి అయిన పూర్ణ తన కూతురు పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు మానవులందరికీ ఆదర్శం



హైదరాబాద్‌లో రసమయి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో 'పలుకరించే పరిమళాలు' రుబాయీ సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో ఎల్లూరి శివారెడ్డి, పి. విజయబాబు, పి.ఎల్. సంజీవరెడ్డి, గ్రంథకర్త తిరుమల శ్రీనివాసాచార్య, ఆలపాటి బాపన్న, ఎం.కె. రాము ఉన్నారు.




అంటూ స్థానికంగా ఒక పత్రికవారు "పూర్ణ మాతృత్వాన్ని" వార్తా చిత్ర కథనంగా కూడా ప్రచురించారు. అయినవాళ్లు, తెలిసినవాళ్లూ అంతా శ్రీజ అక్షరాభ్యాస కార్యక్రమ ఏర్పాట్లను పదేపదే నెమరువేసుకుంటూ గడిపేస్తున్నారు.

* * *

అనుకోకుండా ఒక సాయంత్రం కాన్వెంట్ నుంచి వచ్చిన శ్రీజకు ఊహించని పరిణామం ఎదురైంది. తొలిసారిగా పూర్ణామేడం చేతి దెబ్బ రుచిచూసింది!! ఎన్నడూ తల్లి చేతి దెబ్బ రుచిచూడని శ్రీజ ఆత్మస్థైర్యానికి దెబ్బతగిలింది. ఆవేశం ఏరులై పొంగి, ఏడ్పు ఊట బావిలా ఉబుకుబికి వచ్చింది. నేలమీద దొర్లే బొంగరంలా నీళ్లల్లో పడ్డ ఈగలా అన్నీ తానే అయింది ఆ క్షణాన. ఎవరూ ఆపలేని ఏడుపు ప్రవాహమే అయింది ఒకానొక సందర్భంలో.

"ఏమే గారాలపట్టీ.... పూర్ణాదేవిగారి కలల బొమ్మా... ఎందుకేడుస్తున్నావ్?" అంటూ పరామర్శకొచ్చింది పక్కింటి కోమలామేడం.

"మరేమో మరేమో.. అమ్మ నన్ను కొట్టింది" అలవాట్లో పొరబాటుగా మళ్లీ అనేసి రాగాల సరాగాలు మరికాస్త పెంచింది శ్రీజ.

ఆ మాట విన్న కోమలకు వినరాని మాట విన్నదానిలా కళ్లు బైర్లుకమ్మినట్లు అయినాయి. "సహనమూర్తి అందునా నీమీద బోలెడు ప్రేమాభిమానాలు లీటర్లకొద్దీ కురిపించే పూర్ణ నిన్ను కొట్టడమా?" అంటూ అవాక్కయ్యింది. "బహుశా నువ్వేదో పెద్ద పెంకిపని చేసుంటావ్" అంది కోమల.

"అదేంకాదు బిగ్ మమ్మీ... మర్చిపోయి మా మమ్మీని అమ్మా అని పిలిచా" అంది ముక్కుదారలు చేతితో నుదుటికి అంటిస్తూ వెక్కివెక్కి ఏడుస్తూ.

"లేకపోతేను వేలకు వేలు డొనేషన్లు, వందలకు వందలు ఫీజులు కట్టి చదివించేది ఎందుకు? నలుగురిలో తలవంపులు తేకుండా నాల్గు ఇంగ్లీష్ముక్కలు మాట్లాడతారనే కదా! ఆ మాత్రం అలవాటు చేయకపోతే వీళ్లు అనవసరంగా పాడయిపోవడం ఖాయం" అంది పూర్ణ సహనం కోల్పోయిన భూమాతలా!! ●